AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN
27-2-2026 (Friday) MAIN EDITION

## కోల్‌కతాలో భూకంపం..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కోల్‌కతాలో భూకంపం చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కోల్‌కతా నగరంలోని పలు ప్రాంతాల్లో భూకంపం వచ్చింది. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ ప్రకారం 5.5 తీవ్రతతో భూమి కంపించింది. నైరుతి బంగ్లాదేశ్‌లోని భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. భూ ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల లోతులో ఉంది. దీంతో తక్కువ స్థాయిలో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అయితే ఏం జరుగుతుందో తెలియక ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

## డీఎంకేలో చేరిన పన్నీర్ సెల్వం



**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మాజీ సీఎం, జయలలిత నమ్మకస్తుడిగా పేరున్న పన్నీర్ సెల్వం డీఎంకేలో చేరారు. అవినీతి కేసుల కారణంగా జయలలిత రెండుసార్లు సీఎం పదవికి రాజీనామా చేసిన సమయంలో తన పదవిని పన్నీర్ సెల్వంకు అప్పగించారు. ఆమె చనిపోయిన తర్వాత కూడా ఆయనే సీఎం అయ్యారు. మూడు సార్లు అన్నాడీఎంకే నుంచి సీఎంగా పని చేసిన పన్నీర్‌సెల్వం తమిళనాడు సీఎం స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరారు.

## హామీలు విస్మరిస్తే ఎలా..




**అక్షరటుడే, కరీంనగర్:** ఎన్నికల ముందు హామీలివ్వడం.. తర్వాత మాట తప్పడం కాంగ్రెస్ నేతలకు వెన్నతో పెట్టిన విద్య అని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. యాసంగి మొదలై రెండు నెలలైనా రైతు భరోసా నిధులు జమ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు సంజయ్ బహిరంగ లేఖ రాశారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో బ్రేక్‌ఫాస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్ :** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇచ్చే బ్రేక్ ఫాస్ట్ మిక్స్‌ను మంత్రి సీతక్క శుక్రవారం రుచి చూశారు. త్వరలో పైలట్ ప్రాజెక్టు కింద బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ప్రారంభించనున్నారు. దీంతో ఆమె రుచి చూసి అధికారులకు పలు సూచనలు చేశారు. బ్రేక్ ఫాస్ట్ మిక్స్ మరింత మృదువుగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

## ఆక్వా సాగును ప్రోత్సహిస్తాం



**అక్షరటుడే, ఏపీ :** తమ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవపై విమర్శలు చేస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని విమర్శించారు. ఆక్వా సాగును మరింత ప్రోత్సహిస్తామని, రైతులు ఏఐ టెక్నాలజీ వినియోగించుకునేలా చర్యలు చేపడతామన్నారు.



## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ

**అక్షరటుడే, హైదరాబాద్:** ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. దానం నాగేందర్ తరపున న్యాయవాదులు విచారణకు హాజరయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన విషయం తెలిసిందే. వారిపై వేటు వేయాలని బీఆర్ఎస్ స్పీకర్‌ను కోరింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. అయినా కూడా విచారణ ఇంకా కొనసాగుతోంది. తాజాగా దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ విచారణ చేపట్టారు. ఆయనపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్లు వేశారు. అయితే దానం తరపున అడ్వకేట్‌లు అఫిడవిట్ దాఖలు చేయలేదని బీఆర్ఎస్, బీజేపీ అడ్వకేట్‌లు చెప్పారు. దీంతో స్పీకర్ తదుపరి విచారణను మార్చి 2కు వాయిదా వేశారు.

## హైదరాబాద్‌ను ఎంఐఎంకు అప్పగించే కుట్ర

**అక్షరటుడే, హైదరాబాద్:** నగరంలో సమస్యల పరిష్కారం కోసం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బస్తీ బాట పట్టారు. అధికారులను వెంటబెట్టుకుని పలు బస్తీల్లో ఆయన పర్యటించారు. సికింద్రాబాద్ పరిధిలోని బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. బీజేపీని రాజకీయంగా దెబ్బతీయాలనే జీహెచ్ఎంసీ మూడు ముక్కలు చేశారని ఆరోపించారు. కోర్ సిటీని ఎంఐఎంకు అప్పగించాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు.





లిక్కర్ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. దేశంలో సంచలనం సృష్టించిన ఈ కేసును ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. ఢిల్లీ మద్యం పాలసీ తయారులో అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగేలా చేశారని సీబీఐ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఛార్జీషీట్‌లో మెరిట్ లేదని న్యాయస్థానం కేసును కొట్టివేసింది. కేజ్రీవాల్, ఢిల్లీ మాజీ మంత్రి మనీష్ సిసోడియా, కవిత సహా పలువురికి క్లీన్ చిట్ ఇచ్చింది.

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# లిక్కర్ కేసులో బిగ్ రిలీఫ్

- కేజ్రీవాల్, కవితకు కోర్టు క్లీన్‌చిట్
- సాక్ష్యాధారాలు లేవని కొట్టివేసిన న్యాయస్థానం
- నిజం గెలిచిందన్న జాగృతి అధ్యక్షురాలు
- కంటతడి పెట్టిన మాజీ సీఎం కేజ్రీవాల్

లిక్కర్ కేసుపై విచారణ చేపట్టిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులపై నమోదు చేసిన కేసులు కొట్టేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు పేర్కొంది. సరైన ఆధారాలు లేకుండానే.. పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితులు తప్పు చేశారనడానికి సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. లిక్కర్ కేసులో లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని న్యాయస్థానం సీబీఐపై ఆగ్రహించింది. ఈ విషయంలో సీబీఐ అధికారులపై దర్యాప్తు చేయాలని ఆదేశించింది. కవిత ఆడిటర్ అయిన బుచ్చిబాబుతో పాటు అభియోగాలు మోపబడిన 23 మందికి కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు పేర్కొంది.

### నిజం గెలిచింది : కల్వకుంట్ల కవిత

లిక్కర్ స్కామ్‌లో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. ఈ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వచ్చానని తెలిపారు. తన తల్లిదండ్రులు, అత్తామామలు అండగా నిలిచారని గుర్తు చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేయడానికే ఈ కేసు పెట్టారని ఆరోపించారు. తనను మూడేళ్ల పాటు నానా మాటలు అన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేశారన్నారు. రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని నిరూపితమైందని చెప్పారు. తనకు అండగా నిలిచిన వారిని మరిచిపోనని కవిత అన్నారు. లిక్కర్ కేసుతో తాను, తన కుటుంబం కొన్ని నెలల పాటు క్షోభ అనుభవించామని ఆమె చెప్పారు. ఈ కేసులో కవిత ఐదున్నర నెలల పాటు జైలులో ఉన్నారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చారు. తప్పుడు కేసుతో తనను పెట్టారని, ఆ సమయంలో కుటుంబానికి, పిల్లలకు దూరం చేశారన్నారు. దీనికి ఎవరు జవాబు చెబుతారని ప్రశ్నించారు.

### అసలేం జరిగిందంటే!

ఢిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్‌లో లిక్కర్ పాలసీ తీసుకొచ్చింది. అనంతరం 2022 సెప్టెంబర్ చివరికి వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో లిక్కర్ విధానంలో అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎక్సైజ్ పాలసీని సవరించిన సమయంలో వీరు అక్రమాలకు పాల్పడ్డారంటూ సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేశారని.. ఇందుకు ప్రతిఫలంగా కొంత మొతం పొందారని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈ స్కాంలో భాగంగా ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, పలువురు ఆప్ నేతలు, మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితలను అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా.. తాజాగా కోర్టు ఆదేశాలతో వారికి ఊరట లభించింది.

### వీరికి ఊరట..

కేజ్రీవాల్, సిసోడియా, కవితతో పాటు కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్, విజయ్ నాయర్, అభిషేక్ బోయిన్‌పల్లి, అరుణ్ రామచంద్ర పిళ్లై, మూత గౌతమ్, సమీర్ మహేంద్రు, అమన్‌దీప్ సింగ్ ధాల్, అర్జున్ పాండే, బుచ్చిబాబు గోర్నట్ల, రాకేష్ జోషి, దామోదర్ సింగ్, ప్రసాద్ కుమార్, అర్పిత్ శర్మ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశిష్ మాథుర్, పి శరత్ చంద్రారెడ్డికి కూడా కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది.

### కంటతడి పెట్టిన కేజ్రీవాల్

అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందన్నారు. తనపై ప్రధాని మోదీ, అమిత్ షా కలిసి కుట్ర చేశారని ఆరోపించారు. మీడియాతో మాట్లాడుతూ.. భావోద్వేగానికి గురైన ఆయన కంటతడి పెట్టారు. తాను అవినీతిపరుడిని కాదని, కేజ్రీవాల్, మనీష్ సిసోడియా కట్టర్ ఇమాందార్ (పూర్తిగా నిజాయితీపరులు) అని కోర్టు తెలిపిందన్నారు.

## అవినీతి, అరాచకమే కాంగ్రెస్ పాలన : కేటీఆర్




**అక్షరటుడే, హైదరాబాద్:** అవినీతి, అరాచకమే కాంగ్రెస్ పాలన అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆలంపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన మున్సిపల్ కౌన్సిలర్లను శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో సన్మానించారు. అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు తదితరులు పాల్గొన్నారు. ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్‌పైనే ఉందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు చెక్ డ్యామ్‌లు పేల్చడం, పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు నరకడం చేస్తున్నారని ఆరోపించారు.

## గ్రూప్–1 అధికారులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ


**అక్షరటుడే, ఏపీ :** ఆంధ్రప్రదేశ్‌లో 2018 బ్యాచ్ గ్రూప్-1 అధికారులకు సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. వారిని అప్రాధాన్య పోస్టుల్లోకి బదిలీ చేయాలన్న హైకోర్టు తీర్పును ధర్మాసనం సమర్థించింది. ఏపీలో 2018లో గ్రూప్-1 నియామకాలు జరిగాయి. పేపర్ల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గతంలో విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ సిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు 2018 బ్యాచ్ గ్రూప్-1 అధికారులను అప్రాధాన్య పోస్టుల్లోకి బదిలీ చేయాలని సూచించింది. దీనిని ఉద్యోగులు సవాల్ చేయగా.. సుప్రీంకోర్టు ప్రాధాన్య పోస్టులు లేకపోతే ఉద్యోగాలు చేయలేరా అని ప్రశ్నించింది. ఎక్కడున్నా జీతం వస్తుందని, సంతృప్తి పడాలని పేర్కొంది.

## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అఫ్గానిస్థాన్‌పై పాక్ యుద్ధం ప్రకటించింది. పలు నగరాలపై వైమానిక దాడులు చేసింది. తాజా దాడుల తర్వాత బహిరంగ యుద్ధం జరుగుతోందని పాకిస్తాన్ రక్షణ మంత్రి తెలిపారు. రెండు దేశాల మధ్య కొంతకాలంగా సరిహద్దు ఘర్షణలు నెలకొని ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పాక్ యుద్ధానికి దిగింది. 'మా సహనం నశించింది. ఇక బహిరంగ యుద్ధమే' అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ ఆసిఫ్ ప్రకటించారు. గతంలో సైతం పాక్ వైమానిక దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో తాలిబన్ ప్రభుత్వం పాక్‌పై దాడులు చేపట్టింది. ఈ క్రమంలో గురువారం రాత్రి పాక్ యుద్ధం ప్రకటించింది. యుద్ధ విమానాలతో కాబూల్, కాందహార్, ఫక్తియా ప్రావిన్స్‌లపై వైమానిక దాడులు చేపట్టింది. దీంతో అఫ్గాన్ సైతం ఎదురుదాడికి దిగింది.

## ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు విడుదల




**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్ బిల్లుల కోసం బిల్లులు విడుదల చేసింది. ప్రతి నెల ఉద్యోగులకు ప్రభుత్వం పెండింగ్ బకాయిలు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ. 745 కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొన్నేళ్లుగా ఉద్యోగులకు బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఉద్యోగ సంఘాలు నాయకులు గతంలో ఆందోళనలు చేపట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో చర్చించారు. ప్రతి నెల కొద్ది కొద్దిగా బకాయిలు చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు జూన్ నుంచి పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ. 700 కోట్లకు తక్కువ కాకుండా మంజూరు చేస్తోంది. పెండింగ్ బిల్లులు కోసం నిధులు విడుదల చేస్తుండటంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రిసెప్షన్‌కు మోదీని ఆహ్వానించిన విరోష్ జోడీ

ప్రధాని నరేంద్రమోదీని విజయ్, రష్మిక కలిశారు. హైదరాబాద్‌లో మార్చి 4న జరగనున్న వారి రిసెప్షన్‌కు మోదీని ఆహ్వానించారు. ప్రధానితో వీరిద్దరు కలిసి దిగిన ఫొటోలు బయటకు వచ్చాయి. రిసెప్షన్ కోసం ఇప్పటికే కేంద్ర మంత్రి అమిత్ షాతో పాటు పలువురు సినీ రాజకీయ ప్రముఖులకు ఆహ్వానం పలికారు. హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో వేడుక జరుగనుంది.

—అక్షరటుడే, సినిమా డెస్క్

